క్లుప్తంగా

శబరిమలకు ఎమ్మెల్సీ తోట పయనం



మండపేటలో ఇరుముడి కట్టుకున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: అయ్యప్ప మాలధారి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇరుముడులు కట్టుకుని స్వామి దర్శనార్థం శబరిమలకు పయనమయ్యారు. మండపేట పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన మాలధారి సుబ్రహ్మణ్యం నంబూద్రి ఎమ్మెల్సీ తోటతో ఇరుముడుల కట్టే ప్రక్రియను భక్తిశ్రద్ధలతో చేయించారు. 15వ సారి మాలధారణ చేసి, శబరిమల వెళ్తున్న ఎమ్మెల్సీ తోటను కలిసేందుకు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

ఘనంగా మార్గశిర పౌర్ణమి పూజలు



విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం పౌర్ణమిని పురస్కరించుకుని పీఠంలో ఉన్న విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చకులు పంచద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే పీఠంలోని భవాని శంకర అష్టమలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వర స్వామివారికి తులసి దళ అర్చనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్‌ఓ వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బి.రమ, పి.సత్యకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో బలిదానాల పార్టీ సీపీఐ

రామచంద్రపురం: ఎందరో త్యాగధనుల బలిదానాలతో నిర్మితమైన పార్టీ సీపీఐ అని డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు వెలగా వెంకట కృష్ణారావు(ల్యాబ్ కృష్ణ) పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. పార్టీ నాయకుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణానికి, సమైక్యతకు, లౌకికవాదం, శ్రామిక వర్గ హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటం నడిపిందన్నారు. దేశ ప్రజల కోసం బలిదానాలు చేసిన పార్టీ మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రాము, ఉండవిల్లి గోపాలరావు, వి.కృష్ణమూర్తి, వి.రాంబాబు, ఎస్.శారదాదేవి. ఎండీ గౌస్, వివిధ సంఘాల నాయకులు వై.జానకిరామ్, బి.సత్యనారాయణ, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ–కోటిపల్లి రహదారిలో గొల్లపాలెంలోని కాజులూరు జంక్షన్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సు ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయాల్లో సరైన షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపుల అరుగుల పైనా, దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రాయవరం ఉన్నత పాఠశాలలో క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



ద్రాక్షారామలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ అంబటి భవాని



పామర్రులో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే..

- మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
- 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలు ప్రారంభం

రామచంద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువత క్రీడా నైపుణ్యాలను వెలికితీసే విధంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పండగ వాతావరణంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని మంత్రి వేణు లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సంప్రదాయబద్ధమైన క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టారన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కుతుందని, ఇలాంటి కార్యక్రమాన్ని యువతలో ఉత్సాహం కలిగించేలా కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి ఆలోచనకు మంత్రి అభినందనలు తెలిపారు. సంక్రాంతి సంప్రదాయ క్రీడలకు సమాహారంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులతో పాటు స్థానిక సచివాలయ సిబ్బంది, ఆసక్తి కలిగిన ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఎంతో స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. క్రీడల్లో పాల్గొనడమే కాకుండా, వారికి అవసరమైన కిట్లను ఈ కార్యక్రమంలో అందించడం ఒక విశేషమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా, వారి మనోభావాలకు అనుగుణంగా కిట్ల పంపిణీ చేశారన్నారు. యువత పెద్దఎత్తున పాల్గొంటున్నారని, మంచి నైపుణ్యంతో తమ ప్రతిభను ప్రదర్శించాలని క్రీడాకారులకు మంత్రి సూచించారు. పురపాలక సంఘం చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కేతా శ్రీను, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, పెద్ద ఎత్తున స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు. పార్టీ నేతలు తొగరు మూర్తి, కంచుమర్తి బాబూరావు, పెంటపాటి శ్రీను, చెల్లుబోయిన, ప్రకాశ్, సత్తి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి వేణు

రాష్ట్రానికి క్రీడా సంక్రాంతి : వేణు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా సంక్రాంతి తెచ్చారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ద్రాక్షారామ పీవీఆర్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని మంత్రి వేణు లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకుల్లో క్రీడా సామర్థ్యాలను గుర్తించి, అంచెలంచెలుగా క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం రూపొందించారన్నారు. గిరిజన ప్రాంతానికి చెందిన మేరీ కోమ్ దేశంలోనే ఒలింపిక్స్‌కు అర్హత పొందిన ఏకైక మహిళా బాక్సర్‌గా గుర్తింపు పొందారన్నారు. ధృఢమైన సంకల్పంతో కృషి చేస్తే క్రీడల్లో అంతర్జాతీయ ఖ్యాతి పొందడానికి ఆమె స్ఫూర్తి అన్నారు. గ్రామీణ ప్రాంతల్లో క్రీడలను ప్రోత్సహించేలా ముఖ్యమంత్రి క్రీడా సామగ్రి అందించడంతో పాటు సరైన వేదికలను సిద్ధం చేశారన్నారు. మంత్రి ముందుగా జాతీయ పతాకాన్ని, ఆడుదాం ఆంధ్రా పతాకాలను ఎగురవేశారు. అనంతరం పలు పోటీలను ప్రారంభించారు. జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్, బళ్ల సుధాకర్, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, టేకుమూడి సుజాత, పెమ్మిరెడ్డి దొరబాబు, నక్కిన దొరబాబు, డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి

క్రీడా స్ఫూర్తితో విజయవంతం చేయాలి

కె.గంగవరం: యువత క్రీడా స్ఫూర్తితో ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. కె.గంగవరం, పామర్రు ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ఆటలను స్ఫూర్తిదాయకంగా ఆడాలని కోరారు. అనంతరం క్రీడాకారులు, ప్రజాప్రతినిధులతో షటిల్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఎంఈఓ నాగరాజు, సర్పంచ్‌లు, కోటి లక్ష్మీనరసమ్మ, వాసంశెట్టి వెంకటదుర్గ, నానాపరపు కల్యాణి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు అచ్యుతరామయ్య, నాయకులు వాసంశెట్టి సూరిబాబు, చీకట్ల గోపాలం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం

కాజులూరు: చదువుతో పాటు క్రీడలూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. కాజులూరు, మంజేరు, శీల, జగన్నాథగిరి, బందనపూడి గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.125 కోట్లతో ఈ ఆటల పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. తొలి బాల్‌ను విసిరి వాలీబాల్ పోటీలను ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు ప్రారంభించారు. సర్పంచ్ దండంగి చిన్నారావు, సీపీసీఎస్ చైర్మన్ మేడిశెట్టి రాము, హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, స్కూల్ పీడీ కౌర్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన క్రీడా స్ఫూర్తి

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో మంగళవారం క్రీడా స్ఫూర్తి ఉప్పొంగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభించారు. ద్రాక్షారామలో పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, పీఈటీలు గెడ్డం అనురాధ, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాత, తోట నాగమణి, జీవీ గోవిందమ్మలు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలు ఆడించారు.

క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకే..

రాయవరం: యువతీ యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ యువతీ యువకులను ప్రోత్సహించేందుకు ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో 19 సచివాలయాల పరిధిలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోటీలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పార్టీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పడాల కమలారెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

ఊరూవాడా ఆటల సందడి

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్రా ఆటల సందడి నెలకొంది. మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు ఆటలను పర్యవేక్షించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు క్రీడలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో సంక్రాంతి పండగ ముందే వచ్చిందన్న భావన కలుగుతోందన్నారు. నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు వాసా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా సంబరం ఆరంభం

కపిలేశ్వరపురం (మండపేట): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మండపేట పట్టణం, రూరల్‌లోని 12 గ్రామాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, ఎంపీడీఓ ఐదం రాజు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ఏడిద రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ క్రీడలను ప్రారంభించారు. కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్ పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య బాబు, రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధరం, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు వివిధ క్రీడలను ప్రారంభించారు. కేశవరంలోని జెడ్పీ హైస్కూల్‌లోని క్రీడలను ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీను, ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణ, చంద్రమళ పోతురాజు, జేసీఎస్ ఇన్‌చార్జి బందెల సాయిరామ్, జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి అబ్బిరెడ్డి వీర్రాజు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి అద్దంకి రమణ పర్యవేక్షించారు. అర్తమూరులో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మాజీ వైస్ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి క్రీడలను ప్రారంభించారు. ఏడిదలో జెడ్పీటీసీ కురుపూడి భవాని, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పలివెల సుధాకర్ పాల్గొన్నారు.



మండపేటలో క్రీడలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి



కేశవరంలో వాలీబాల్ క్రీడను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉండమట్ల



ఏడిదలో క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ భవాని, సర్పంచ్ ఆశీర్వాదం

ట్రేడ్ యూనియన్‌లో మండపేటకు ప్రాధాన్యం

ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులుగా పుల్లేశ్వరరావు, నాగేశ్వరరావు



టపా పుల్లేశ్వరరావు



శెట్టి నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ కమిటీ నియామకం జరిగింది. మండపేట నియోజకవర్గానికి తగిన ప్రాధాన్యం లభించింది. కమిటీ ప్రధాన కార్యదర్శిగా టపా పుల్లేశ్వరరావు, కార్యదర్శులుగా కొండపల్లి వీరప్రసాద్, కాకిలేటి మోహన్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా కాకి సత్యనారాయణ, శెట్టి నాగేశ్వరరావు నియమితులయ్యారు. తమకు అవకాశం ఇవ్వడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రేడ్ యూనియన్ రంగంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు. వారికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిపక్ష నేతల మద్దతు

కపిలేశ్వరపురం (మండపేట): సమస్యల పరిష్కారానికై అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు ప్రతిపక్ష ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మద్దతు పలికారు. మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట 15వ రోజు నిరసన శిబిరాన్ని వారు సందర్శించారు. మాజీ మున్సిపల్ చైర్మన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించాలన్నారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై ఆర్డీఓ సమావేశం

రామచంద్రపురం: ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కు సంబంధించి నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈవీఎం వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు అన్ని మండలాల తహసీల్దార్ల కార్యాలయాలు, పోలింగ్ స్టేషన్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మైలా వెంకటేశ్వరరావు, టి.వైద్యనాథ్‌శర్మ, సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు ఓటరు నమోదు అధికారి వి.మదన్ మోహన్‌రావు అన్నారు. మండపేటలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల రెండు దఫాలుగా నిర్వహించిన ఓటు నమోదు శిబిరాల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన విషయాలను వివరించారు. మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పార్టీల నేతలతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

రంగా ఆశయ సాధనకు పాటుపడాలి



అంగరలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాజులూరు: దివంగత నేత వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు నేటి తరం నాయకులు పాటుపడాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. కాజులూరులో మంగళవారం స్థానిక కాపు నాయకులు నిర్వహించిన వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాల్లో హర్షకుమార్ పాల్గొన్నారు. రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలగాకాపు సంఘం నాయకుడు వంగా శ్రీనివాస్(రంగా) ఆధ్వర్యంలో జరిగిన సభలో హర్షకుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వంగవీటి మోహనరంగాను రాజకీయ దురుద్దేశాలతో కొందరు హతమార్చారన్నారు. పాలకులు ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాళ్ల ధనరాజు, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, కుయ్యేరు మాజీ సర్పంచ్ పోతుల మాధవ తదితరులు పాల్గొన్నారు.

రంగాకు ఘన నివాళులు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ, ఊడిమూడి, కె.గంగవరం గ్రామాల్లో మంగళవారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని కాపు నాయకులు ఘనంగా నిర్వహించారు. సత్యవాడ గ్రామంలో నాయకులు సలాది ప్రకాష్, చవాకుల వెంకటేశ్వరరావు, సలాది రాంబాబు, బండారు బద్రి, తోట చిన మాచరావు తదితరులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా పేద ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుత యువత రంగా అడుగుజాడల్లో ప్రజాసేవ చేయాలని కోరారు.

యువతకు ఆదర్శప్రాయుడు వంగవీటి

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల ఉద్యమ నాయకుడు వంగవీటి మోహనరంగా నేటి యువతకు ఆదర్శప్రాయుడని మంగళవారం ఆయన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అంగర, కోరుమిల్లి, తదితర గ్రామాల్లోని రంగా విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కాపు సంఘం నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అంగరలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, అంగర, పడమర ఖండ్రిక సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ పెద్దిరెడ్డి శేషారత్నం, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, సహకార సంఘాల చైర్మన్లు గంగుమళ్ల రాంబాబు, గుడిమెట్ల శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నేతలు పసలపూడి శ్రీనివాసరావు, పాలింగి కిషోర్, మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామి కాపు, తాపీ మేస్త్రుల సంఘం నాయకులు మేడేపల్లి కొండ, దళిత నాయకులు రేలంగి శ్రీనివాసరావు, మండల శెట్టి బలిజ సంఘం అధ్యక్షులు వాసంసెట్టి వాసు పాల్గొన్నారు.



కాజులూరులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న హర్షకుమార్ తదితరులు

సోమేశ్వరంలో..

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో కాపునేత వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని రంగా విగ్రహానికి నివాళులర్పించారు. కాపునాడు మండల శాఖ అధ్యక్షుడు నున్న వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పేకేటి ఈశ్వరరావు, కాపు సంఘం నేతలు నాగదేవర తాతాజీ, శాకా లక్ష్మీనారాయణ, పెమ్మనబోయిన కృష్ణ, శాకా శ్రీనివాసరావు, అడపా రాముడు, శాకా రమేష్ పాల్గొన్నారు.